# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-2 30, అక్టోబరు, 2014

ఏడాదిలోగా తెలంగాణలోని రహదారులన్నింటిని అద్దంలా మారుస్తామని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావు ప్రకటించారు. ఇందుకోసం ఈ బడ్జెట్‌లోనే నిధులు కూడా కేటాయిస్తామన్నారు. జిల్లాకు 1000 కోట్ల రూపాయల ఖర్చు చేసి 10 వేల కోట్లతో రోడ్లను బాగుచేయాలని నిర్ణయించారు. పివి.నరసింహరావు ఎక్స్‌ప్రెస్ హైవే తరహాలో హైదరాబాద్‌లో మరో నాలుగు ఎక్స్‌ప్రెస్ హైవేలను నిర్మించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. రోడ్లను బాగుచేసే అంశాన్ని అధ్యయనం చేసేందుకు ఉప ముఖ్యమంత్రి డా.టి.రాజయ్య అధ్యక్షునిగా మంత్రులు ఈటెల రాజేందర్, పోచారం శ్రీనివాసరెడ్డి, నాయిని నర్సింహ్మరెడ్డి, టి.హరీష్‌రావు, కే.టి.రామారావు, జగదీష్ రెడ్డి, జోగు రామన్న సభ్యులుగా కేబినెట్ సబ్ కమిటీని నియమించారు.

తెలంగాణ రాష్ట్రంలోని రహదారుల పరిస్థితిపై ముఖ్యమంత్రి సచివాలయంలో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి డా.టి.రాజయ్య, ఆర్థిక శాఖ మంత్రి ఈటెల రాజేందర్, ప్రభుత్వ శాఖల కార్యదర్శులు నర్సింగ్‌రావు, నాగిరెడ్డి, రామకృష్ణారావు, స్మితా సబర్వాల్, ఆర్ అండ్ బి ఇఎన్‌సి రామకృష్ణ తదితరులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. గత ప్రభుత్వం రహదారులను ఏ మాత్రం పట్టించుకోలేదని, ఫలితంగా గ్రామ స్థాయిలోని రోడ్ల నుంచి మొదలు కొని హైదరాబాద్ వరకు అన్ని ప్రాంతాల్లో రహదారుల పరిస్థితి అధ్వాన్నంగా తయారయిందని, రోడ్లపైన ప్రయాణం చేయడమే ఓ నరకంగా మారిందని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఈ పరిస్థితి ఉండటానికి వీలు లేదని చెప్పారు.రోడ్ల నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో నిత్యం ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయని అన్నారు. ఈ పరిస్థితిని నివారించడానికి తెలంగాణ రాష్ట్రంలో యుద్ధ ప్రాతిపదికన రహదారుల నిర్మాణం, మరమ్మత్తులు, విస్తరణ కార్యక్రమాలు చేపట్టాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. వివిధ జిల్లాల నుండి హైదరాబాద్‌కు వచ్చే ప్రయాణికులు గంటల తరబడి ప్రయాణం చేయాల్సి వస్తోందని చెప్పారు. వరంగల్, కరీంనగర్, మెదక్, నల్గొండ లాంటి జిల్లా కేంద్రాల నుండి ఔటర్ రింగ్ రోడ్డుకు గంటన్నర లోపే చేరుకుంటున్నప్పటికి అక్కడి నుండి నగరంలోకి ప్రవేశించడానికి రెండు గంటలు పడుతోందని ముఖ్యమంత్రి చెప్పారు. దీనివల్ల జిల్లాల నుంచి వచ్చే ప్రయాణికులే కాకుండా

నగరంలోని వారు కూడా ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈ పరిస్థితిని నివారించడానికి జిల్లా కేంద్రాల రహదారులకు అనుబంధంగా పివి.నరసింహరావు ఎక్స్‌ప్రెస్ హైవే తరహాలో నాలుగు ఎక్స్‌ప్రెస్ హైవేలను నిర్మిస్తామని ప్రకటించారు. వరంగల్ నుండి వచ్చే వారి కోసం ఔటర్ రింగు రోడ్డు నుండి ఉప్పల్ వరకు, కరీంనగర్ నుండి వచ్చే వారి కోసం ఔటర్ రింగురోడ్డు నుండి జూబ్లి బస్‌స్టేషన్ వరకు, బోధన్, మెదక్ ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం ఔటర్ రింగు రొడ్డు నుండి ప్యారడైజ్ వరకు, నల్గొండ నుండి వచ్చే వారికోసం ఔటర్ రింగు రోడ్డు నుండి ఎల్‌బి నగర్ వరకు ఎక్స్‌ప్రెస్ హైవేలను నిర్మించాలని ముఖ్యమంత్రి చెప్పారు. జిల్లాల్లోని అన్ని రహదారులను కూడా మెరుగు పరచాలని ఆదేశించారు. నగరంలో పార్కింగ్ సమస్యను నివారించేందుకు మల్టి స్టోర్డ్ పార్కింగ్ ప్లేసెస్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. అభివృద్ధి చెందిన దేశాలలోని నగరాల్లో ఈ సౌకర్యం ఉందని, హైదరాబాద్‌లో కూడా అందుబాటులోకి తేవాలని చెప్పారు. తెలంగాణలో రోడ్ల అభివృద్ధి కార్యక్రమాన్ని రోడ్స్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ద్వారా చేపట్టాలని, అవసరమైతే తెలంగాణ స్టేట్ రూరల్ రోడ్స్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్‌ను ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంతాల రోడ్లను ఆ కార్పోరేషన్‌కు అప్పగించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు.

రహదారుల నిర్మాణం అంశాలను అధ్యయనం చేయడానికి ఏర్పాటు చేసిన మంత్రి వర్గ ఉప సంఘం ఈ రెండు మూడు రోజుల్లోనే సమావేశం కావాలని కూడా ముఖ్యమంత్రి ఆదేశించారు. తెలంగాణలో ఆర్ అండ్ బి, పంచాయతిరాజ్ పరిధిలో వున్న రహదారులెన్ని? బిటి రహదారులెన్ని? సింగిల్ రోడ్లు ఎన్ని? డబుల్ రోడ్లు ఎన్ని? బ్రిడ్జిలు ఎక్కడ ఉన్నాయి? రహదారుల విస్తరణ ఎక్కడ అవసరం? బ్రిడ్జిల నిర్మాణం ఎక్కడ అవసరం? కాజ్‌వేలు ఎక్కడ కట్టాలి? వివాదాల్లో ఉన్న రహదారులెన్ని? వాటిని ఎలా పరిష్కరించాలి? తదితర అంశాలన్నింటిపైనా కూలంకషంగా చర్చించి మంత్రి వర్గ ఉప సంఘం చాలా తక్కువ సమయంలోనే నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ నివేదిక వచ్చిన వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని సిఎం వెల్లడించారు. రహదారుల నిర్మాణం పనులు కూడా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర పునర్‌నిర్మాణంలో రహదారుల అభివృద్ధి కూడా ముఖ్యమైన అంశమేనని ముఖ్యమంత్రి ప్రకటించారు.

---

సిపిఆర్ఓ టు సిఎం